'కల్యాణలక్ష్మి'కి ఎదురుచూపు

- మూడు నెలల నుంచి అందని చెక్కులు
- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు

కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, జడ్పీ చైర్మన్ కృష్ణారావు (ఫైల్)

పెంచికల్ పేట్, మార్చి 29 : మండలంలోని 12 గ్రామాలకు చెందిన లబ్ధిదారులు మూడు నెలల నుంచి కల్యాణ లక్ష్మి చెక్కు కోసం ఎదురు చూస్తున్నారు. తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హయాంలో నిరుపేద కుటుంబాల ఆడబిడ్డ పెళ్లి చేస్తే ఆ ఇంటికి అన్ని తానై ప్రభుత్వం కానుకగా కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మొట్టమొదటిసారి 50,116 రూపాయలు అందించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కుటుంబానికి ఆర్థిక ఖర్చులు పెరగడంతో మరోసారి దానిని పెంచి 75,116 రూపాయలు అందజేశారు. చివరగా దానిని 1,00,116 రూపాయలను రాష్ట్రంలో నూతనంగా పెళ్లి చేసుకున్న ఆడబిడ్డలకు అందించారు. మండలంలోని 12 గ్రామపంచాయతీలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు రైతు వేదికలో డిసెంబర్‌లో జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు చెక్కులను అందించారు. అందులో పలు చెక్కులు మూడు రోజుల వాలిడిటీ మాత్రమే ఉండగా, వాటిని లబ్ధిదారులు సంబంధించిన బ్యాంకులో జమ చేశారు. వాటిని బ్యాంకు వారు కలెక్షన్ కోసం పంపేసరికి వాలిడిటీ ముగిసింది. దీంతో తిరిగి లబ్ధిదారులకు అందజేశారు. ఆ చెక్కులను లబ్ధిదారులకు తహసీల్దార్ తిరిగి అందజేయగా 10 నుంచి 15 రోజుల్లో మళ్లీ వస్తాయని ఆయన తెలిపారు. మూడు నెలలు గడిచినా లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి డబ్బులు అందలేదని ఆందోళన చెందుతున్నారు. ఇంతకుముందు దరఖాస్తు చేసుకున్న వారికి , ఈ మూడు నెలల్లో దరఖాస్తు చేసుకున్న వారికి ఎలాంటి చెక్కులు అందజేయలేదని, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ విషయంలో నూతన ప్రభు త్వం జాప్యం చేస్తున్నదని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది అప్పు తెచ్చి కూతుళ్ల పెళ్లి చేసుకున్న వారు వడ్డీల భారం పడుతున్నదని బాధపడుతున్నారు. ఈ విషయంపై వాలిడిటీ ముగిసిన చెక్కులతో లబ్ధిదారులు నమస్తే తెలంగాణను సంప్రదించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాలిడిటీ ముగిసిన చెక్కుల స్థానంలో కొత్తవి అందించాలని కోరుతున్నారు.

అప్పుచేసి బిడ్డ పెళ్లి చేసిన

నిరుపేద కుటుంబానికి చెందిన నాకు ముగ్గురు ఆడపిల్లలు. రెండో కూతురు పెళ్లి చేస్తే ప్రభుత్వ పథకం ద్వారా కల్యాణలక్ష్మి డబ్బులు వస్తాయని అప్పు చేసి మరీ బిడ్డపెళ్లి చేశాను. ఇప్పటికి సంవత్సరం అవుతుంది. ఇటీవల అధికారులు, ప్రజాప్రతినిధులు చెక్కును అందించారు. బ్యాంకులో వేసేసరికి డేట్ అయిపోయిందని తిరిగి ఇచ్చారు. ఆ చెక్కును తహసీల్దార్‌కు అందజేశాము. ఇప్పటికైనా ఆ డబ్బులు అందించి ఆదోకోవాలని కోరుతున్నాను.

-గోలేటి దుర్గుబాయి, ఎల్లూరు

వాలిడిటీ ముగిసిన చెక్కులు అందించారు

తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి దరఖాస్తు చేసుకున్న మూడు నెలలకే కల్యాణ లక్ష్మి చెక్కులను మంజూరు చేశారు. కానీ అధికారులు కార్యాలయంలో పెట్టుకొని కాలయాపన చేసింద్రు. మూడు రోజుల గడువు ఉన్న చెక్కులను ఇచ్చింద్రు. అవి బ్యాంకులో వేసేసరికి గడువు ముగిసిందని బ్యాంకు వారు తిరిగి అందించారు. ఆ చెక్కు గానీ, డబ్బులు గానీ ఇప్పటివరకు అందించలేదు. అధికారులు ఆ డబ్బులు అందించాలని కోరుతున్నాం.

-దుర్గం అంకుబాయి, ఎల్లూరు

మూడు నెలల నుంచి తిరుగుతున్నాం

నా కూతురు పెళ్లి చేసి కల్యాణ లక్ష్మి దరఖాస్తు చేసుకున్నాను. కల్యాణ లక్ష్మి చెక్కు మంజూరు కాగా అందించారు. కానీ గడువు అయిపోయింది. మళ్లీ తిరిగి తహసీల్దార్‌కు అందించాము. చెక్కుల కోసం మూడు నెలల నుంచి వారానికి రెండుసార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం. చెక్కులు వస్తాయని చెబుతున్నారు తప్ప అందించడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి మళ్లీ చెక్కులు గానీ, డబ్బులు గానీ అందించాలని కోరుతున్నాం.

-దుర్గం శకుంతల, ఎల్లూరు

డబ్బులు అందేలా చర్యలు తీసుకుంటాం

కల్యాణలక్ష్మి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు చెక్కులను అందించాం. అందులో కొన్ని గడువు ముగిసిన మాట వాస్తవమే. సదరు చెక్కులను ఆర్డీవో కార్యాలయానికి పంపించాం. మళ్లీ తిరిగి వాటికి సంబంధించిన డబ్బులను లబ్ధిదారులకు అతి త్వరలో అందిస్తాం. ఉన్నతాధికారులతో మాట్లాడి కల్యాణలక్ష్మి చెక్కులు తిరిగి ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

-వెంకటేశ్వరరావు, తహసీల్దార్ (పెంచికల్ పేట్)

బాల్య వివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు

బాల్యవివాహంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే
- పర్సనంబాలలో బాల్య వివాహం అడ్డగింత
- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

ఆసిఫాబాద్, మార్చి 29:బాల్య వివాహాలు జరిపిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్‌పాండే హెచ్చరించారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండలం పర్సనంబాల గ్రామంలో బాల్య వివాహం జరిపిస్తున్నారని సమాచారం అందడంతో బాలల సంరక్షణ అధికారి మహేశ్‌తో పాటు సంబంధిత అధికారుల సమన్వయంతో గ్రామానికి చేరుకొని వివాహ కార్యక్రమాన్ని నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా అమ్మాయి, అబ్బాయి, వారి తల్లిదండ్రులకు బాల్య వివాహం చేయడం వలన కలిగే నష్టాలను వివరిస్తూ కౌన్సెలింగ్ ఇచ్చారు. అమ్మాయికి 18 సంవత్సరాల వయసు నిండిన తర్వాత మాత్రమే వివాహం చేయాలని సూచించారు. అంతకు ముందుగా చేస్తే వయసు ప్రభావం చేత ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాత వివాహం జరిపించేందుకు ఇద్దరి తల్లిదండ్రులు అంగీకరించారని తెలిపారు. బాలిక సంరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లుగా తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజ్యలక్ష్మి, సీడీపీవో సదియా రుక్సానా, అధికారులు, ఉన్నారు.

నియామక పత్రం అందజేత

మంచిర్యాల ఏసీసీ, మార్చి 29: మంచిర్యాలకు చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సీనియర్ మెంబర్ వీ మధుసూదన్ రెడ్డిని రెడ్ క్రాస్ తెలంగాణ రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యుడిగా కలెక్టర్, ఐఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు బదావత్ సంతోష్ నియమించారు. ఈ సందర్భంగా శుక్రవారం రెడ్‌క్రాస్ రాష్ట్రశాఖ కార్యదర్శి మదన్‌మోహన్ హైదరాబాద్‌లోని రాష్ట్ర శాఖ కార్యాలయలో నియామక పత్రాన్ని అందించారు. మూడేళ్లు నియామకం సమయం వర్తిస్తుందని తెలిపారు.

మూలమలుపులో ఇరుక్కున్న వాహనాలు

కెరమెరి ఘాట్ మూల మలుపువద్ద ఇరుక్కుపోయిన లారీలు

- స్తంభించిన రాకపోకలు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

జైనూర్, మార్చ్ 29:మండలంలోని బూసిమెట్టక్యాంపు ఘాట్ మూలమలుపు వద్ద శుక్రవారం తెల్లవారుజామున రెండు లారీలు ఇరుక్కుపోయాయి. దీంతో ఆసిఫాబాద్ నుంచి జైనూర్ వైపు వచ్చే వాహనాలు, జైనూర్ నుంచి ఆసిఫాబాద్ వెళ్లే వాహనాలు గంటల తరబడి స్తంభించిపోయాయి దీంతో బస్సుల్లో ఉన్న ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఇరుక్కుపోయిన లారీని జేసీబీ సాయంతో పక్కకు తీయగా మరో లారీ రోడ్డుపై ఇంజిన్ జామ్ అయింది. ఆ వాహనాన్ని కూడా జేసీబీ సాయంతో పక్కకు తీశారు. ఈ ఘటనలో ఉదయం 10 గంటల వరకు వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. కెరమెరి ఘాట్ మూలమలుపులో వాహనాలు బోల్తా పడడం సంవత్సరాల తరబడి జరుగుతూనే ఉంది. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అధికారులు తాత్కాలిక చర్యలు తీసుకోవడం తప్ప రోడ్డు వెడల్పు పనులు కానీ, ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు కానీ తీసుకోవడంకానీ చేయడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మూలమలుపులో అధికారులు రోడ్డు వెడల్పు పనులు చేయించక పోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఘాట్ మూలమలుపులో రోడ్డు వెడల్పు పనులు పూర్తిచేసి ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యువత వ్యసనాలకు బానిస కావద్దు

చింతకుంట గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ కరుణాకర్, సీఐ సాదిక్

సిర్పూర్(టీ), మార్చి 29 : యువత వ్యసనాలకు బానిసై తమ ఉన్నతమైన జీవితాలను నాశనం చేసుకోవద్దని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ సూచించారు. శుక్రవారం చింతకుంట గ్రామంలో కౌటాల సీఐ సాదిక్‌పాషా, పోలీసు సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి అపరిచిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఆన్‌లైన్, క్రికెట్ బెట్టింగులు పెట్టి డబ్బును వృథా చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన తనిఖీల్లో సరైన ధువపత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలకు జరిమానా విధించగా, ముగ్గురిపై మద్యం కేసు నమోదు చేసినట్లు సిర్పూర్(టీ) దీకొండ రమేశ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ గడ్డ..సట్టా మట్కా అడ్డా!

- పట్టణంలో విచ్చలవిడిగా మట్కా
- అరికట్టడంలో విఫలమవుతున్న పోలీసులు
- చాపకింద నీరులా జూదం
- అత్యాశతో అమాయకుల జేబుగుల్ల

ఇటీవల పోలీసులు పట్టుకున్న సట్టా మట్కా జూదరులు (ఫైల్)

కాగజ్‌నగర్, మార్చి 29: కాగజ్‌నగర్ పట్టణం సట్టా మట్కాకు అడ్డాగా మారింది. అడ్డూ అదుపు లేకుండా పట్టణంలోని వివిధ కాలనీల్లో ఓపెన్ సీక్రెట్‌గా సట్టా మట్కా జూదం విచ్చలవిడిగా సాగుతుంది. అత్యాశతో కొందరు అమయాకులు జేబులు గుల్ల చేసుకుంటున్నారు. కొద్ది రోజులు క్రితం స్థానిక పోలీసులు అక్కడక్కడ దాడులు చేసి మట్కా జూదరులను పట్టుకున్నప్పటికీ అసలు సూత్రదారులను పట్టుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. చిన్నా చితక జూదరులను పట్టుకొని కేసు నమోదు చేయడం తప్ప బడా జూదరుల జోలికి పోలీసులు పోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. జూదరులు చిక్కినా పోలీసు స్టేషన్‌కు చేరకముందే ప్రజా ప్రతినిధుల నుంచి ఫోన్ రావడం, వారిపై పీటీ కేసు నమోదు చేసి వదిలేయడం శరమామూలుగా మారింది. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు ఉండడంతో మట్కా జూదాన్ని పోలీసులు పూర్తి స్థాయిలో కట్టడి చేయలేకపోతున్నారు. ఇటీవలే పోలీసులు మట్కా స్థావరాలపై దాడులు నిర్వహించి 30 మందిపై 15 కేసులు నమోదు చేసి, 20 సెల్ ఫోన్లు స్వాధీనపర్చుకున్నట్లు సమాచారం. కాగజ్‌నగర్ పట్టణంలోని తీరందాస్ టాకీస్ ఏరియా, రైల్వే స్టేషన్ రోడ్డు, సర్‌సిల్క్, రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద నిత్యం జూదరుల అడ్డగా మారింది. ఈ ప్రాంతంలో నిత్యం లక్షల రూపాయల మట్కా జూదం కొనసాగుతుంది. ఉదయం 11 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు సట్టా మట్కా జూదం కొనసాగుతుంది. రోజువారి కూలీ నుంచి ప్రభుత్వ ఉద్యోగులు సైతం సట్టా మట్కా జూదానికి బానిసయ్యారు. పండుగలు, ఆదివారాలు, సెలవు దినాల్లో తప్ప నిత్యం సట్టామట్కా నడుస్తుంది. ఎంతో మంది జూదానికి అలవాటుపడి ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, ఈస్గాం, చింతగూడ, రెబ్బెన, బెజ్జూర్, కౌటాల, మంచిర్యాల జిల్లాలోని తాండూర్‌తో పాటు పెద్దపల్లి జిల్లా రామగుండం, కరీంనగర్ జిల్లా చొప్పదండి, వరంగల్, బెల్లంపల్లి, తదితర ప్రాంతాల నుంచి కాగజ్‌నగర్‌కు వచ్చి సట్టా మట్కా ఆడుతున్నట్లు సమాచారం. పోలీసు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకొని పట్టణంలో ఓపెన్ సీక్రెట్‌గా కొనసాగుతున్న మట్కా నిషేధించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్థికంగా ముంచుతున్న మట్కా

కష్టపడకుండా డబ్బులు సంపాదించాలని అత్యాశతో కొందరు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓఎన్‌లో రూ.100 పెడితే రూ.1000, పానలో రూ.25 పెడితే రూ.3000, జోడిలో రూ.50 పెడితే 5000 సంపాదించవచ్చనే అత్యాశ యువతను ముంచుతుంది. ఇలా ఎన్ని డబ్బులు పెడితే అంత ఎక్కువగా లాభం పొందవచ్చని తెలుపడంతో అత్యాశకు పోయి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. ఒకప్పుడు చీటీల ద్వారా నిర్వహించే సట్టా మట్కా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ఆన్‌లైన్ ద్వారా కొనసాగిస్తున్నారు. గతంలో రైలు ద్వారా మహారాష్ట్రకు వెళ్లి మట్కా జూదం ఆడేవారు. ప్రస్తుతం గల్లీకో సట్టా మట్కా ఏజెంట్ తయారవడంతో కాగజ్‌నగర్ కేంద్రంగా జూదం కొనసాగిస్తున్నారు. యూట్యూబ్ చానల్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర సోషల్ మీడియాను మట్కా జూదానికి వాడుకుంటున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో నిత్యం శ్రీదేవి, టైంబజార్, మిలన్ డే, రాజధాని, కళ్యాణి సంస్థలు సట్టా మట్కా అధికంగా నిర్విహిస్తుంటాయి.

మట్కా ఆడితే కఠిన చర్యలు

కాగజ్‌నగర్ పట్టణంలో సట్టా మట్కా ఆడినా, ఆడించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. కాగజ్‌నగర్‌లో సట్టా మట్కా కట్టడి చేశాము. ఇటీవలే కొందరు జూదరులను పట్టుకొని కేసు నమోదు చేశాం. పట్టణంలో ఎక్కడైనా సట్టా మట్కా, పేకాట జూదం నిర్వహిస్తే పోలీసులకు సమాచారం అందించాలి, వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

-శంకరయ్య, టౌన్ సీఐ కాగజ్‌నగర్

కుమ్రంభీం మ్యూజియం సందర్శన

జోడేఘాట్ కుమ్రంభీం మ్యూజియంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెంచికల్ పేట్, మార్చి 29 : పీఎంశ్రీ విద్యావైజ్ఞానిక యాత్రలో భాగంగా జోడేఘాట్ కుమ్రం భీం మ్యూజియాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. విద్యా విజ్ఞాన యాత్రను ఎంఈవో రమేశ్‌బాబు జెండా ఉపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల మాట్లాడుతూ మ్యూజియంలో భద్రపరిచిన వస్తువుల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించామన్నారు. అనంతరం భీం స్తూపం, విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇక్కడ ఉపాధ్యాయులు యాదగిరి, గంగాభవానీ, సుజాత, లక్ష్మి, నగేశ్, కళావతి, భారతి, శ్రీధర్, సాదియా, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

ఖైర్‌గూడ ఓసీపీలో తిరుపతికి వినతిపత్రం అందిస్తున్న ఆపరేటర్లు

రెబ్బెన, మార్చి 29: బెల్లంపల్లి రీజియన్‌లో విధులు నిర్వహిస్తున్న ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్ల సమస్య వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీ లో శుక్రవారం ఈపీ ఆపరేటర్లు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈపీ ఆపరేటర్ల 2022-2023 సంవత్సరానికి సంబంధించిన ప్రమోషన్లు డీ టూనీ, సీ టూబీ, బీటూఏ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. రామగుండం కొత్తగూడెం రీజియన్ లో ప్రమోషన్లు భర్తీ కోసం యాజమాన్యం పరీక్షలు నిర్వహించి పూర్తి చేశారని, కానీ బెల్లంపల్లి రీజియన్ లో ప్రమోషన్లు భర్తీకి ఎన్నికల కోడ్ ఉందని అనడం సరికాదన్నారు. రెగ్యులర్ ప్రమోషన్లకు ఎన్నికల కోడ్ తో సంబంధం లేదని తెలిపారు. బెల్లంపల్లి రీజియన్ లో ఆపరేటర్లకు పరీక్షలు నిర్వహించి వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జూపాక రాజేశ్, కిరణ్‌బాబు, దివాకర్, ఆపరేటర్లు గణేశ్, మోహన్‌రావు, రారాజు, తిరుపతి, సంతోష్, రవి, అజాం, ఇర్షద్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేస్తాం

రెబ్బెన, మార్చి 29: సింగరేణి ఎన్నికల సమయంలో ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘంగా గెలిపిస్తే సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేరుస్తామని గోలేటి బ్రాంచి కార్యదర్శి తిరుపతి స్పష్టం చేశారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ యాజమాన్యంతో చర్చించి ఒప్పించడంతో సింగరేణి వ్యాప్తంగా సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ విద్యా విధానం అమలు చేయడం కోసం యాజమాన్యం నిర్ణయించిందన్నారు. ఈ విషయమై యాజమాన్యం కార్మికుల నుంచి స్టేట్, సెంట్రల్ సిలబస్ పై అభిప్రాయ సేకరణ కోసం సర్క్యులర్ జారీ చేశారని చెప్పారు. సీబీఎస్ఈ విద్యా విధానం అమలు కోసం కార్మికులు తమ అభిప్రాయం చెప్పాలని యూనియన్ తరపున విజ్ఞప్తి చేశారు.

ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు సహకరించాలి

ఫ్లాగ్‌మార్చ్‌లో డీఎస్పీ సదయ్య, సీఆర్పీఎఫ్ దళాలు

రెబ్బెన, మార్చి 29: వచ్చే పార్లమెంట్ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగే విధంగా ప్రజలు సహకరించాలని ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సీఆర్పీఎఫ్ దళాల ఫ్లాగ్‌మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఎలక్షన్ కమిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసినా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచానికి శాంతి సందేశం

చర్చి ఎదుట గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రీస్తు వేషధారణలో ఫాదర్

పెంచికల్ పేట్,మార్చి 29: ప్రపంచానికి శాంతి సందేశాన్నిస్తూ క్రీస్తు శిలువ నెక్కిన రోజును గుడ్ ఫ్రైడే గా జరుపుకుంటామని ఫాదర్స్ నైజు, మిథున్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సెయింట్ క్లారిట్ చర్చిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుత సమాజం కోసం సన్మార్గ జీవనాన్ని మానవ జాతికి తెలియజేయడం కోసం శిలువ నెక్కిన క్రీస్తు తన రక్తాన్ని చిందించిన రోజును ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం చర్చి ఆవరణలో జీసస్ వేషధారణతో ఆకట్టుకున్నారు. భక్తులు పాల్గొన్నారు.

దుర్గంధంగా ప్రధాన రహదారి

పెంచికల్ పేట్, మార్చి 29 పెంచికల్ పేట్-బొంబాయి గూడ ప్రధాన రహదారి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. రోడ్డు పక్కన విచ్చలవిడిగా పడేసిన కోళ్ల కళేబరాలు ప్రయాణికులు, వాకర్స్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ వ్యర్థాలు, దుర్వాసనతో వ్యాధులు సంక్రమించే ప్రమాదమున్నందున సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థాలు వేసే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రధాన రహదారి పక్కన విచ్చలవిడిగా విడిగా ఉన్న కోళ్ల కళేబరాలు